
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5
జిల్లా వార్తలు
గురువారం 30 జనవరి 2025



దరఖాస్తుల ఆహ్వానం

షాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పీఎం శ్రీ పథకం కింద నడుస్తున్న ఆదర్శ స్కూళ్లలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కవిత తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లు ఉన్నాయని, మిగతా 7,8,9,10 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు రూ.125, ఓసీలకు రూ.200 రుసుం చెల్లించాలని సూచించారు. ఏప్రిల్ 3 నుంచి హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని, ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

పిల్లోనిగూడెంలో 14వ శతాబ్దపు
తెలుగు శాసనం

గ్రామంలో రాష్ట్రకూటుల నాటి విగ్రహాలు

పరిశీలించిన ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ శివనాగిరెడ్డి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): నగర శివార్లలోని శంషాబాద్ మండలం పిల్లోని గూడెం గ్రామ సమీపంలో 14వ శతాబ్దపు తెలుగు అక్షరాలతో రాసిన శిలాశాసనం లభించింది. అలాగే ఇక్కడ స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం ప్రాంగణంలో ఉన్న నిలువెత్తు వీరగల్లు విగ్రహంతో పాటు మరికొన్ని విగ్రహాలు రాష్ట్ర కూటల కాలానికి(9వ శతాబ్దానికి) చెందినవిగా నిర్ధారించారు. ఈ ఆలయం పక్కనే శిలాశాసనం కనిపించడంతో స్థానికులైన నేషనల్ కల్చర్ ఫౌండేషన్ అధ్యక్షులు పట్నం కృష్ణం రాజు ఈ విషయాన్ని ప్రముఖ పురావస్తు శాస్త్రవేత్త, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ శివనాగిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఈ గ్రామాన్ని సందర్శించిన ఆయన శిలాశాసనంతో పాటు అదే కాలం నాటి శివలింగం నంది విగ్రహాలను కూడా పరిశీలించారు. ఇవి క్రీ.శ 14వ శతాబ్దపు శాసనంగా భావించిన శివనాగిరెడ్డి ఈ విషయాన్ని కేంద్ర పురావస్తుశాఖ శాసన విభాగపు సంచాలకు డాక్టర్ మునిరత్నం రెడ్డికి పంపారు.



శిలాశాసనాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి

శిలాశాసనంలో దానం ఇచ్చినట్లు

మునిరత్నం నాయుడు ఈ శిలాశాసనం రౌద్రనామ సంవత్సరం (క్రీ.శ 1381)నాటిదిగా నిర్ధారించారు. ఓరుగంటి (ఓరుగల్లు) నాగనాయుడు సోదరుడు వినకుడు గూడూరులో (అప్పట్లో ఈ గ్రామం పేరు)ని గణపేశ్వర, దేవర (ఈశ్వర) దేవతలకు ప్రేమతో దానం ఇచ్చినట్లు శిలాశాసనంలో రాసి ఉంది. ఈ శిలాశాసనం కింద నంది చిత్రం కూడా చెక్కారు. అయితే ఏమి దానం చేశారనేది ఇందులో పేర్కొనలేదు. ఈ ఆలయ ప్రాంగణంలో ఉన్న విగ్రహాలు ఇప్పటికే పూజలు అందుకుంటున్నప్పటికీ ఇవి ఏ కాలం నాటివో ఇప్పటి వరకు తెలియదు. అయితే ఈ 9వ శతాబ్దానికి చెందిన రాష్ట్రకూటముల నాటి విగ్రహాలుగా శివారెడ్డి తెలిపారు. పక్క గ్రామానికి చెందిన వారితో పశుగ్రాసం కోసం జరిగిన సంఘర్షణలో వీర మరణం పొందిన వీరగల్లుతో పాటు ఆ ఘర్షణలో అశువులు బాసిన మరో ఇద్దరి విగ్రహాలు కూడా ఉన్నాయి. రాష్ట్ర కూటుల నాటి కాలానికి చెందిన అనేక ఆనవాళ్లు అనేక ప్రాంతాల్లో బయటపడినప్పటికీ ఇవి చెక్కుచెదర కుండా అద్భుతంగా ఉన్నాయని ఆయన చెప్పారు. హైదరాబాద్ పరిసరాల్లో రాష్ట్ర కూటుల ఆనవాళ్లు లభించడం సంతోషమని ఇంతకు ముందు రంగారెడ్డి జిల్లాలో చిల్కూరు, నార్సింగ్‌లలో కూడా రాష్ట్ర కూటుల ఆనవాళ్లు బయటపడ్డాయని తెలిపారు.



14వ శతాబ్దపు శిలాశాసనం



మొగిలిగిద్ద పాఠశాలకు
150 ఏళ్లు
7



సౌర కాంతులు

పీఎం సూర్యఘర్ యోజనతో పల్లెలు జిగేల్

దేశంలో విద్యుత్ కొరతను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం సూర్యఘర్ యోజన పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రతీ జిల్లా నుంచి మూడు, నాలుగు ఆదర్శ గ్రామాలను ఎంపిక చేసి వందశాతం ఇళ్లు, కార్యాలయాలు, వ్యవసాయ బోర్లతో పాటు ఇతర వనరులన్నింటికీ సౌర విద్యుత్ అందించాలనే లక్ష్యంతో అడుగులు వేస్తోంది. తర్వాత దశలవారీగా అన్ని గ్రామాలకు విస్తరించనున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో దేశంలో కోటి ఇళ్లకు సోలార్ ప్యానెళ్లు అమర్చి సౌరకాంతులు తీసుకురావాలని కేంద్రం నిర్ణయించింది. ఆదర్శ గ్రామంలో సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను స్థానిక అవసరాలకు వినియోగించడంతో పాటు అదనంగా ఉత్పత్తి చేసే విద్యుత్‌ను డిస్కమ్‌లకు లబ్ధిదారులు అమ్ముకునే విధంగా పథకాన్ని రూపొందించారు.

6

- ఆదర్శ గ్రామాల్లో 100శాతం సోలార్ విద్యుత్
- జిల్లాకు మూడు, నాలుగు గ్రామాల ఎంపిక
- రెడ్కో విద్యుత్ సంస్థల ద్వారా సర్వే
- దశలవారీగా మిగతా గ్రామాలకు విస్తరణ
- కోటి ఇళ్లకు ప్యానెళ్లు అమర్చేలా ప్రణాళిక



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) భవిష్యత్తులో పల్లెలకు కరెంట్ కష్టాలు తొలగనున్నాయి. విద్యుత్ కొరతను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ పథకాన్ని దశలవారీగా అన్ని గ్రామాలకు విస్తరించేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాకు మూడు నుంచి నాలుగు గ్రామాలను ఎంపిక చేయాలని రాష్ట్రాలకు ఆదేశించింది. ఇందులో భాగంగా ఇప్పటికే సర్వే నిర్వహించి గ్రామాల ఎంపిక కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. రెడ్కో (రాష్ట్ర పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ) విద్యుత్ సంస్థలు కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఎంపిక చేసిన ఆదర్శ గ్రామాల్లో వందశాతం ఇళ్లు, కార్యాలయాలు, వ్యవసాయ బోర్లతో పాటు ఇతర వనరులన్నింటికీ సౌర విద్యుత్ అందించనున్నారు. తరువాత దశలవారీగా మిగతా గ్రామాలకు విస్తరిస్తారు. ఈ ఆర్థిక సంవత్సరంలో దేశ వ్యాప్తంగా కోటి ఇళ్లకు సోలార్ ప్యానళ్లు అమర్చి

మిగతా 7వ పేజీలో...

వైభవంగా రథోత్సవం

భక్తులతో కిక్కిరిసిన చేవెళ్ల బాలాజీ లక్ష్మీవేంకటేశ్వర ఆలయం

చేవెళ్ల, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల బాలాజీ లక్ష్మీవేంకటేశ్వర స్వామివారి రథోత్సవాన్ని బుధవారం కనుల పండువగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయం నుంచి చేవెళ్ల గ్రామంలోని రచ్చబండ వరకు ఊరేగించారు. రథాన్ని లాగేందుకు దారి పొడువునా భక్తులు పోటీపడ్డారు. దీంతో ఆ ప్రాంతమంతా గోవింద నామస్మరణతో మారుమోగింది. ఈ కార్యక్రమంలో దేవాలయ ఈవో నరేందర్, ఫౌండర్లు దేవుని వామనా చార్యులు, ధర్మకర్తలు శ్రీపాదు, పూజారులు అనంతం, వాసు, శ్రీపాదు, కన్న, వైభవ్ తోపాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. రథోత్సవం సందర్భంగా చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్, ట్రాఫిక్ సీపీ వెంకటేశం ఆధ్వర్యంలో ఎస్సైలు శ్రీకాంత్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, ఏఎస్సైల చందర్ నాయక్, పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



చేవెళ్లలో బాలాజీ లక్ష్మీవేంకటేశ్వర స్వామివారి రథోత్సవంలో భక్తులు

మొగిలిగిద్ద పాఠశాలను
అభివృద్ధి చేస్తాం

- రేపు జరిగే 150 వసంతాల వేడుకకు సీఎం రేవంత్ రాక
- 10వేల మందితో బహిరంగ సభ
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎంతో చరిత్ర కలిగిన మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాలను అన్నివిధాలుగా అభివృద్ధి పరుస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెల్లడించారు. పాఠశాల 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 31న నిర్వహించే వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాయంత్రం 4గంటలకు హాజరుకానున్నారని తెలిపారు. ఈ మేరకు బుధవారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మొగిలిగిద్ద గ్రామ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళిక రూపొందించామని, దానిని సీఎంకు అందజేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు, పేద విద్యార్థులకు కార్పొరేట్ తరహా విద్యను అందించేందుకు కొందుర్గు మండలంలో రూ.150 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

16 ఎకరాల్లో బహిరంగ సభ

సీఎం రాక సందర్భంగా మొగిలిగిద్ద పాఠశాలకు చెందిన 16 ఎకరాల్లో బహిరంగ సభను నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులతో పాటు విద్యావేత్తలను సభకు ఆహ్వానిస్తున్నామన్నారు. 150 ఏళ్ల చరిత్ర గల పాఠశాలను గత ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలి

షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కోసం కృషి చేయాలని జేఏసీ మేధావులు ఎమ్మెల్యే వీర్లపల్లిని కోరారు. ఈ మేరకు బుధవారం క్యాంపు కార్యాయలంలో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. నాయకులు జనార్దన్, నక్క బాలరాజు, కరుణాకర్, రాము, అర్జున్‌కుమార్, బాదేపల్లి సిద్దార్థ వినతి చేసిన వారిలో ఉన్నారు.

ముమ్మర ఏర్పాట్లు

షాద్‌నగర్‌రూరల్ : సీఎం రేవంత్ రాక కోసం ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్, ఆర్డీఓ సరిత ఇతర అధికారులతో కలిసి ఎమ్మెల్యే వీర్లపల్లి మొగిలిగిద్ద గ్రామాన్ని సందర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి గ్రామానికి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ మంజూరు చేస్తామని చెప్పడంతో ఇందుకోసం ఆ శాఖ అధికారులు సాలె గడ్డలో ఉన్న పాఠశాల ఆవరణలో స్థలాన్ని పరిశీలించారు. అలాగే వైద్య ఆరోగ్య శాఖ అధికారులు హెల్త్ సెంటర్ కోసం గతంలో బాలుర వసతి గృహం నిర్వహించిన భవనాన్ని పరిశీలించారు. మొగిలిగిద్ద పాఠశాల స్థలంలో నూతన భవనం నిర్మించేందుకు అధికారులు పరిశీలించారు. అనంతరం సభ జరిగే స్థలాన్ని చదును చేయించారు. హెలీప్యాడ్ స్థలాన్ని ఎంపిక చేశారు.



జాన్‌వెస్లీని సన్మానిస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారానికి
ఉద్యమాలు

యాచారం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా నియామకమైన జాన్‌వెస్లీని ఆ పార్టీ మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహాతో పాటు రాష్ట్ర నాయకులు పి.యాదయ్య, కె.జగన్, విప్లవ్‌కుమార్‌లు బుధవారం నగరంలోని జాన్‌వెస్లీ ఇంటికి వెళ్లి కలిశారు. శాలువాలతో ఘనంగా సత్కరించారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ యాచారం మండలంతో తనకు ఎంతో అనుబంధం ఉందన్నారు. గ్రామగ్రామాన ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కారం కోసం ఉద్యమాలు లేవదీస్తామని వెల్లడించారు. ఇంటి స్థలం లేని నిరుపేదలకు స్థలం కేటాయించడంతో పాటు ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినట్లు నాయకులు తెలిపారు.

బైపాస్ రోడ్డును
పట్టించుకోరా?

- ఇబ్రహీంపట్నంలో ట్రాఫిక్ కష్టాలు
- రహదారిపై వ్యర్థాల పారబోత
- కంపు భరించలేకపోతున్న స్థానికులు
- అభివృద్ధిపై దృష్టిసారించని ప్రభుత్వం



రోడ్డుపైనే వ్యర్థాలు

ఇబ్రహీంపట్నం టౌన్ నుంచి వెళ్తున్న బైపాస్ రోడ్డు

ఇబ్రహీంపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం టౌన్‌లో రోజురోజుకూ ట్రాఫిక్ పెరిగిపోతోంది. ఈ ప్రాంతంలో పరిశ్రమలతోపాటు పలు ప్రభుత్వ రంగ సంస్థలు, ఇంజినీరింగ్, పీజీ కళాశాలలు అధికంగా ఏర్పాటవుతుండటంతో వాహనాల రద్దీ పెరిగింది. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని కృష్ణా పైప్‌లైన్ వెంట బైపాస్ రోడ్డు ఏర్పాటు చేశారు. అయితే ఈ రోడ్డును అభివృద్ధి చేయకపోవడంతో చాలావరకు నిరుపయోగంగా మారిందని చెప్పవచ్చు.

7 కి.మీ పొడవున బైపాస్ రోడ్డు

నాగార్జునసాగర్ రహదారికి లింక్ చేస్తూ సుచిరా బార్ నుండి రాయపోల్, నాగన్‌పల్లి రహదారులను కలుపుతూ కోహెడ రహదారి క్రాసింగ్ వరకు ఏడు కిలోమీటర్ల పొడవునా బైపాస్ రోడ్డును ఏర్పాటు చేశారు. 50 మీటర్ల వెడల్పుతో ఉన్న ఈ రోడ్డులో రెండు కిలోమీటర్ల పొడవున బీటీగా మార్చారు. మిగతాది మట్టి రోడ్డుగా దర్శనమిస్తుంది. అయితే ప్రభుత్వం ఈ రోడ్డుపై దృష్టిసారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. చెరువు కట్ట కింద నుంచి కొహెడ క్రాస్ రోడ్డు వరకు ఒక భాగం, నాగన్‌పల్లి రోడ్డు నుంచి సుచిరా బార్ వరకు రెండో భాగం రోడ్డును అభివృద్ధి చేయాల్సి ఉంది. తట్టి ఖానా వైపు టీజీఐఐసీ సేకరించిన

మిగతా 8వ పేజీలో...

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఏసీపీ శ్రీనివాస్‌రావు

శంషాబాద్ రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని శంషాబాద్ ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు హెచ్చరించారు. బుధవారం ఏసీపీ ఆధ్వర్యంలో నాలు ప్రత్యేక టీంలు శంషాబాద్ పట్టణంలో తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న నాలుగు లాడ్జీలను సీజ్ చేశారు. అలాగే మూడు గుట్కా షాపులు, బెల్టు దుకాణాలను నిర్వహిస్తున్న ఆరుగురిపై కేసు నమోదు చేశారు. అనంతరం హైదరాబాద్-బెంగుళూర్ జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... లాడ్జీల్లో సీసీ కెమెరాలు, జీఎస్టీ, ఫైర్ సేఫ్టీ లేకపోవడంతో కేసులు నమోదు చేశామని చెప్పారు. రోడ్లపై డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ లేకుండా వాహనాలను నడపొద్దని సూచించారు. లాడ్జిల్లో నిబంధనలు పాటించకుంటే భారీ జరిమానా, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సైబర్ మోసాలపై
అప్రమత్తత అవసరం



తలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో సీపీ అవినాశ్ మహంతి

- సైబరాబాద్ సీపీ అవినాశ్‌మహంతి

తలకొండపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి కోరారు. బుధవారం తలకొండపల్లి పోలీసు స్టేషన్‌ను సీపీ సందర్శించారు. శంషాబాద్ డీసీపీ రాజేశ్, అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్, ఏసీపీ రంగస్వామిలతో కలిసి రికార్డులు పరిశీలించారు. ఆమనగల్లు సీఐ ప్రమోద్ కుమార్, ఎస్ఐ శ్రీకాంత్, పోలీసు సిబ్బందితో సమావేశమై పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని, రోడ్డు ప్రమాదాల నివారణ, నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి విక్రయాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. దేవాలయాలు, గ్రామాల ప్రధానకూడళ్లు, దుకాణాల ఎదుట సీసీ కెమెరాలను మరిన్ని ఏర్పాటు చేసేలా చేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాలలో ఘర్షణలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాత నేరస్తులు, రౌడీ షీటర్ల కదలికలు, అనుమానిత ప్రాంతాలు, వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సీపీ ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఐ సీతారామ్ రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఉమ్రా యాత్ర విజయవంతం

శంషాబాద్ రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఉమ్రా యాత్రికులు వర్షంలోనే ప్రార్థనలు చేసినట్లు యాత్రికులు తెలిపారు. జనవరి 15న హైదరాబాద్ నుంచి ఉమ్రా యాత్రకు బయలుదేరిన 15 మంది తిరిగి బుధవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మక్కాలో వర్షం కురిసిందని, భారీ వర్షంలోనే ప్రత్యేక ప్రార్థనలు చేశామని తెలిపారు. మక్కాలో వర్షం ఎక్కువగా కురవడంతో భక్తులు సంతోషాన్ని వ్యక్తం చేసినట్లు తెలిపారు. ప్రతీ ముస్లిం ఉమ్రా యాత్ర చేయాలని కోరారు. ఈమేరకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న యాత్రికులకు ఆల్ మీ జాన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజర్ జీఎం ఖాన్, మేనేజింగ్ డైరెక్టర్ మొహ్మద్ ఫయాజ్ అలీ ఘన స్వాగతం పలికారు.


శంషాబాద్ ఎయిర్‌పోర్టులో యాత్రికులు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


క్రీడల ప్రారంభోత్సవంలో శ్రీరామ్, జ్యోతి, అంజిరెడ్డి

కందుకూరు/మహేశ్వరం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు మార్గాన్ని ఎంచుకోకుండా, విద్య, క్రీడారంగాల్లో రాణించాలని ఏబీవీపీ రాష్ట్ర జాయింట్ కార్యదర్శి కందడి శ్రీరామ్ అన్నారు. ఏబీవీపీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఏబీవీపీ టౌన్ జాయింట్ కార్యదర్శి జ్యోతిప్రసాద్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు, పాఠశాలలు, జూనియర్ కళాశాలల విద్యార్థులకు రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. నిర్వాహకులను అభినందించారు. మాజీ ఎంపీపీ మంద జ్యోతి, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి, ఏబీవీపీ విభాగ్ సంఘటన్ మంత్రి పృథ్వీజీ, వీరపట్నం జిల్లా కన్వీనర్ శివకృష్ణ, నగర శాఖ అధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి డిల్లీ భానుప్రసాద్, నాయకులు, ఏబీవీపీ పూర్వ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే విద్యార్థులు చదువుతో పాటు ఆసక్తిగల క్రీడలపై పట్టు సాధించుకోవాలని విశ్రాంత జాయింట్ కలెక్టర్ మూర్తి అన్నారు. ఖేలో భారత్ క్రీడోత్సవ్-2025ను ఏబీవీపీ ఆధ్వర్యంలో మహేశ్వరం మండల కేంద్రంతో పాటు తుక్కుగూడ మున్సిపాలిటీలో నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ క్రీడా పోటీల ముగింపుకు బుధవారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సీఐ వెంకటేశ్వర్లు, విద్యాధికారి కస్నానాయక్, తదితరులు పాల్గొన్నారు.


ట్రోఫీ అందిస్తున్న మూర్తి

ఫిబ్రవరి 2 నుంచి లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఫిబ్రవరి 2నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బుధవారం బ్రహ్మోత్సవాల సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను కలిసి పత్రిక అందించినట్లు తెలిపారు. నాయకులు తుమ్మ నర్సింహ్మ, బోళ్ల యాదగిరి, పురుషోత్తం, ఆలయ కమిటీ సభ్యులు కేశవులు, పాపయ్య, రాములు, తదితరులు ఉన్నారు.

వేతనాలు చెల్లించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల నిరసన

కడ్తాల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు వెంటనే చెల్లించాలని మండలపరిషత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి ఎంపీడీవో సుజాతకు వినతిపత్రం ఇచ్చారు. నెల నెలా వేతనాలు సక్రమంగా రాక కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని వాపోయారు. ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి వేతనాలు అందేలా చూడాలని కోరారు. ఏపీవో లలిత, కాలే వెంకటేష్, కేతావత్ శ్రీను, పి.శ్రీను తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న యాదయ్య

ఎస్సీ వర్గీకరణ చేపట్టాల్సిందే

» రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

యాచారం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేస్తేనే బడుగు బల హీన వర్గాలకు మేలు కలుగుతుందని పలువురు వక్తలు అన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని సుప్రీంకోర్టు సూచించిందని, కేంద్రం కూడా వర్గీకరణకు కట్టుబడి ఉందని చెప్పారు. బుధవారం యాచారం మండలంలోని నందివనపర్తిలో ఎస్సీ వర్గీకరణ అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఇడుకుల యాదయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు చాలాకాలంగా ఉద్యమాలు చేస్తున్నారని, న్యాయస్థానాలు కూడా వర్గీకరణ చేయాలని సూచించాయన్నారు. వర్గీకరణ కారణంగా నిరుపేదలందరికీ విద్య, ఉద్యోగ రాజకీయపరంగా రిజర్వేషన్లు ఉంటాయని కురుమ సంఘ, యాదవ నాయకులు నర్రె శ్రీశైలం,. ఒంగూరి సాయికుమార్‌లు చెప్పారు. వర్గీకరణ సాధించేవరకు తమ పోరాటం ఆపేదిలేదని ఎమ్మార్పీఎస్ నాయకులు మూలి వెంకటేష్ చెప్పారు. బ్రహ్మణ సంఘ నాయకులు శివ, నాయకులు జంగయ్య, యాదయ్య, రాకేష్, రాందాస్. సుధాకర్ తదితరులున్నారు.

సౌర కాంతులు

(ఐదో పేజీ తరువాయి)

సౌరకాంతులు తీసుకురావాలని కేంద్రం నిర్ణయించింది. ఆదర్శ గ్రామంలో సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను స్థానిక అవసరాలకు వినియోగించడంతో పాటు అదనంగా ఉత్పత్తి చేసే విద్యుత్‌ను డిస్కమ్‌లకు లబ్ధిదారులు అమ్ముకునే విధంగా పథకాన్ని రూపొందించారు. ఇలా లబ్ధిదారులు డిస్కమ్‌లకు విక్రయించే మిగులు విద్యుత్‌కు సంబంధించి యూనిట్‌కు రూ.3.20 చొప్పున చెల్లిస్తారు. దీని వల్ల లబ్ధిదారులకు కొంత ఆదాయం కూడా లభించనుంది. ఈ విధానం ద్వారా లబ్ధిదారులతో పాటు ప్రభుత్వానికి కూడా ప్రయోజనం చేకూరనుంది. ప్రభుత్వం ప్రస్తుతం డిస్కమ్‌ల నుంచి యూనిట్ రూ. 5ల చొప్పున కొనుగోలు చేస్తుంది. సోలార్ విద్యుత్ యూనిట్ రూ.3.20కే లభ్యం కానుండడంతో ప్రభుత్వానికి కూడా ఆర్థిక భారం తగ్గనుంది. ఇదిలా ఉంటే ఇప్పటికే కొందరు స్వచ్ఛందంగా సబ్సిడీపై ఈ పథకం కింద సోలార్ ప్యానళ్లు అమర్చుకుంటున్నారు. అయితే ఆదర్శ గ్రామాల్లో మాత్రం 100శాతం పథకాన్ని అమలు చేయనున్నారు. 5వేల జనాభాకు పైబడిన గ్రామాలను ఎంపిక చేస్తున్నారు. సర్వే ప్రక్రియ పూర్తికాగానే పనులు చేపడతామని అధికారులు తెలిపారు.



పథకం అమలు ఇలా...

ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద ఎంపిక చేసిన గ్రామంలోని వందశాతం ఇళ్లు, కార్యాలయాలు, వీధి దీపాలు, వ్యవసాయ బోర్లతో పాటు ఇతర వనరులన్నింటికీ సోలార్ ప్యానళ్ల విద్యుత్ అందించనున్నారు. గృహాలకు, కార్యాలయాలు, ఇతర వనరులకు రెండు లేదా మూడు కిలో విద్యుత్ వాట్ల ఉత్పత్తి చేసే సోలార్ ప్యానళ్లు అమరుస్తారు. అలాగే వ్యవసాయానికైతే 5 కిలో వాట్లకు పైగా విద్యుత్ ప్యానళ్లు అమరుస్తారు. ఒక్కో కిలో యూనిట్ సోలార్ ఏర్పాటుకు రూ.60 వేల వరకు ఖర్చవుతుంది. యూనిట్‌కు రూ.30వేల వరకు సబ్సిడీ ఇస్తారు. మూడు కిలో యూనిట్లకు పైగా ఉంటే గరిష్ఠంగా రూ.78వేలు సబ్సిడీ ఇస్తారు. ఒక్కో కిలో యూనిట్‌కు నెలకు 120 యూనిట్లకుపైగా విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. గృహ అవసరాలకు ఏర్పాటు చేసే ప్యానళ్ల ద్వారా నెలకు సగటు దాదాపు 300 నుంచి 400 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుందని అంచనా వేశారు. అలాగే వ్యవసాయ అవసరాలకు ఏర్పాటు చేసే ప్యానళ్ల ద్వారా నెలకు 900 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. గృహవసరాలకు 200 యూనిట్ల వరకు విద్యుత్ వాడుకుని మిగతాది అమ్ముకోవచ్చు. అలాగే వ్యవసాయానికి సంబంధించి ఉత్పత్తి చేస్తున్న సోలార్ విద్యుత్‌ను కూడా డిస్కమ్‌లకు అమ్ముకుని కొంత ఆదాయం పొందవచ్చు. ఇక ప్రభుత్వ కార్యాలయాలకు సదరు సంస్థల ద్వారా నిధులు సమీకరించి సోలార్ ప్యానళ్లు అమర్చనున్నారు.

మొగిలిగిద్ద పాఠశాలకు 150 ఏళ్లు

శత వార్షికోత్సవ శిలాఫలకం



● 1873లో ఉర్దూ పాఠశాలగా ప్రారంభం ● రేపు ప్రత్యేక కార్యక్రమం.. సీఎం రేవంత్‌రెడ్డి రాక

షాద్‌నగర్/షాద్‌నగర్ అర్బన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద ఉన్నత పాఠశాల 150 ఏళ్లు పూర్తిచేసుకుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం నిర్వహించబోతున్న ప్రత్యేక కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి రాబోతున్నారు. భారీ స్థాయిలో కార్యక్రమం నిర్వహించడానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు సన్నాహాలు చేస్తున్నారు. దేశానికి స్వాతంత్ర్యం రాకముందే 1873లో నిజాం ప్రభుత్వ హయాంలో ఎండీ అబ్దుల్ రహీం సిద్దిఖీ అనే ఉపాధ్యాయుడు కొద్దిమంది విద్యార్థులతో మొగిలిగిద్దలో ఉర్దూ మాధ్యమ పాఠశాలను ప్రారంభించారు. అద్దె భవనంలో ప్రారంభమైన ఈ పాఠశాలలో 1886లో లక్ష్మణ్‌రావు అనే ఉపాధ్యాయుడు తెలుగు మాధ్యమాన్ని కూడా ప్రారంభించారు. ప్రస్తుతం తెలుగు, ఉర్దూ, ఆంగ్ల మాధ్యమాల్లో బోధన సాగుతున్నది. ఈ పాఠశాలలో చదివిన చాలా మంది ఉన్నత స్థాయికి ఎదిగారు. హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, గవర్నరుగా పనిచేసిన దివంగత బూర్గుల రామకృష్ణారావు, స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ మర్రి చెన్నారెడ్డి, పలు రాష్ట్రాలకు గవర్నర్‌గా పనిచేసిన బి.సత్యనారాయణరెడ్డి, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేస్తున్న ప్రొఫెసర్ జి. హరగోపాల్ వంటి ఎందరో ఈ పాఠశాలలో చదివినవారే. ప్రస్తుతం ఇక్కడ 496 మంది విద్యార్థులు చదువుతున్నారు. 34 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఈ పాఠశాలలో ప్రస్తుతం గదుల కొరత ఉంది. ఆ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడంతో రూ.11.50 కోట్ల వ్యయంతో అన్ని వసతులతో నూతన భవన నిర్మాణానికి అంగీకరించి, శంకుస్థాపన చేయబోతున్నారు. బాలురకు, బాలికలకు వసతి గృహాలు, మినీ స్టేడియం, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను కూడా ఏర్పాటు చేయబోతున్నారు.


మొగిలిగిద్ద ఉన్నత పాఠశాల


ప్రభుత్వ విద్య బలోపేతం



మొగిలిగిద్ద ఉన్నత పాఠశాల 150వ వార్షికోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాబోతుండడంతో ప్రభుత్వ విద్యకు ప్రాధాన్యం పెరుగుతుంది. పాఠశాలకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో ఆదర్శంగా అభివృద్ధి చెందుతుంది.

ప్రొఫెసర్ జి. హరగోపాల్

సీఎం రాకతో పాఠశాల అభివృద్ధి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాకతో మొగిలిగిద్ద పాఠశాలలో సమస్యలు పరిష్కారమై అభివృద్ధి చెందుతుంది. అన్ని వసతులతో నూతన భవనం, విద్యార్థులకు వసతి గృహాల నిర్మాణం జరుగబోతున్నది. ఒక ప్రభుత్వ పాఠశాలకు సీఎం వచ్చి సమస్యలను పరిష్కరించబోతున్నందుకు ప్రధానోపాధ్యాయుడిగా ఎంతో ఆనందిస్తున్నాను.

ఎస్. జనార్దన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు


భవనంపై నుంచి దూకే ప్రయత్నం చేస్తున్న విద్యార్థిని

ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

పరీక్ష ఫెయిల్ అవుతాననే భయంతోనే..!

మేడ్చల్ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పరీక్ష సరిగా రాయకపోవటంతో ఫెయిలవుతానన్న భయంతో ఓ ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. కళాశాల భవనం పెకి ఎక్కి దూకి చస్తానంటూ హడలెత్తించింది. అప్రమత్తమైన విద్యార్థులు, సెక్యూరిటీ గార్డులు విద్యార్థినిని పట్టుకొని ఆత్మహత్యాయత్నాన్ని విఫలం చేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన బుధవారం గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి బాలికల ఇంజనీరింగ్ కళాశాలలో చోటుచేసుకుంది. విద్యార్థులు, సెక్యూరిటీ గార్డుల వివరాల ప్రకారం.. మైసమ్మగూడలోని మల్లారెడ్డి బాలికల ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని నాలుగో అంతస్తు పైకి వెళ్లి కిటికి నుంచి కిందకు దూకే ప్రయత్నం చేసింది. గుర్తించిన తోటి విద్యార్థులు అరుపులు కేకలు వేశారు. అప్రమత్తమైన కొందరు విద్యార్థులు వెనుక నుంచి విద్యార్థిని పట్టుకొని సెక్యూరిటీ గార్డుల సాయంతో కిందికి దించారు. ఈ విషయంలో కళాశాల యాజమాన్యం మౌనంగా ఉంది.

మొగిలిగిద్ద, చించోడ్‌లను మండలాలు చేయాలి

» ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రైవేటు నిధులెందుకు?

» మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

షాద్‌నగర్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మొగిలిగిదద్ద, చించోడ్ గ్రామాలను మండల కేంద్రాలుగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం తన ప్రైవేటు క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మొగిలిగిద్దను మండలం చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ధర్నాలు నిర్వహించిందని, ఇప్పుడు ఆ పార్టీ ముఖ్యమంత్రే స్వయంగా మొగిలిగిద్ద గ్రామానికి వస్తున్నందున మండల కేంద్రంగా ఏర్పాటు చేయడానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషి చేయాలన్నారు. ఆ రెండు గ్రామాలను మండల కేంద్రంగా ప్రకటిస్తే తాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు శాలువాలు కప్పి సన్మానం చేయడంతో పాటు రూ.2కోట్ల నిధులు సమకూరుస్తానని తెలిపారు. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. మొగిలిగిద్ద ఉన్నత పాఠశాల 150 వార్షికోత్సవానికి సీఎం రావడాన్ని తాను స్వాగతిస్తున్నానని చెప్పారు. దాతల సహకారంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల కట్టాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని, ప్రభుత్వం వద్ద కళాశాల నిర్మాణానికి నిధులు లేవా? అని ప్రశ్నించారు. పరిశ్రమల యజమానులు జూనియర్ కళాశాలకు లక్షలాది రూపాయలు ఇవ్వడం వెనుక ఉన్న మతలబు ఏంటో చెప్పాలని కోరారు. ఇంతకు దాతల సహకారంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రభుత్వ అనుమతి ఉందా? ఈ విషయాన్ని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

ఎకరాకు రూ.2 కోట్ల పరిహారం ఇవ్వాలి

» భూసేకరణ డిప్యూటీ కలెక్టర్‌కు బాధిత రైతుల వినతి

ఆమనగల్లు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సాగు చేసుకుంటున్న పచ్చటి పంటపొలాల మీదుగా గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణంతో ఉపాధి కోల్పోతామని ఆమనగల్లు మున్సిపాలిటీ సాకిబండ తండా రైతులు జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజు ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. వారసత్వంగా వచ్చిన భూములు అన్నదమ్ములం పంచుకున్న తర్వాతే సర్వే చేపట్టాలని కోరారు. ఆమనగల్లు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన రాజుకు బుధవారం సాకిబండ తండా, చెన్నంపల్లి రైతులు వినతి పత్రం అందజేశారు. గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డుకు ఒక వేళ భూములు తీసుకుంటే ఎకరాకు రూ.2కోట్ల పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఫ్యూచర్‌సిటీలో 100 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవనోపాధి కోసం జిల్లాలో ఎక్కడైనా భూమికి బదులు భూమి ఇవ్వాలని కోరారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని రైతులు కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని రాజు, తహసీల్దార్ లలితలు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో జైపాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాజురెడ్డి, యాదిరెడ్డి, పాండు, రాజేందర్, రమేశ్, రవిరాథోడ్ పాల్గొన్నారు.

ఐసీడీఎస్ కార్యాలయాన్ని తుక్కుగూడకు తరలించొద్దు

మహేశ్వరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎంతో కాలంగా మహేశ్వరం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఐసీడీఎస్ కార్యాలయాన్ని సంబంధిత సీడీపీవో తన ఇష్టానుసారంగా ఎవరితో సంప్రదించకుండా తుక్కుగూడకు తరలించడం ఎంతవరకు సమంజసమని బీజేపీ నాయకుడు, మహేశ్వరం మాజీ ఎంపీటీసీ పోతర్ల సుదర్శన్‌యాదవ్, బీజేవైఎం నాయకుడు శ్రవణ్ అన్నారు. ఐసీడీఎస్ కార్యాలయాన్ని మహేశ్వరం మండల కేంద్రం నుంచి తుక్కుగూడకు తరలించే ప్రయత్నాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం బీజేపీ నాయకులు మహేశ్వరం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట బైటాయించి ధర్నా నిర్వహించారు. బీజేపీ నాయకుడు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, సీడీపీవో శాంతిశ్రీని వివరణ కోరగా మహేశ్వరంలోని ఐసీడీఎస్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థలో ఉందని.. పాములు, తేళ్లు కార్యాలయంలోకి వస్తున్నాయని, సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారని చెప్పారు. కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేకు వివరించామని, కలెక్టర్ అనుమతితోనే కార్యాలయాన్ని తరలించాలనుకున్నామని, ఇందులో ఎవరి స్వార్థమూ లేదని వివరించారు.

రుణమాఫీ పూర్తిగా చేయాలి

మేడ్చల్ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సహకార సంఘాల పరిధిలోని రైతులకు నూటికి నూరుశాతం రుణ మాఫీ చేయాలని కోరుతూ బుధవారం సహకార సంఘాల చైర్మన్లు అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డికి వినతిపత్రం అందించారు. డబీల్‌పూర్ సొసైటీ పరిధిలో 661 మంది అర్హులైన రైతులు ఉండగా 340 మంది రైతులకు రుణ మాఫీ జరిగిందని, మేడ్చల్ సొసైటీలో 524 మంది రైతులకు 398కి రుణ మాఫీ చేశారని, పూడూరు సహకారం సంఘం పరిధిలో 1400 రైతులకు గాను 1146 మందికి రుణమాఫీ చేశారని పేర్కొన్నారు. అర్హులైన రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని సొసైటీల చైర్మన్లు కోరారు. కార్యక్రమంలో మేడ్చల్ సహకార సంఘం చైర్మన్ రణదీప్ రెడ్డి, డబీల్‌పూర్ సొసైటీ చైర్మన్ సురేష్ రెడ్డి, పూడూరు సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి డైరెక్టర్లు వెంకటేశ్ యాదవ్, మధుసూధన్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, తదతరులు పాల్గొన్నారు.

అనురాగ్‌లో ఏఐ హాక్ డేస్-2025 సదస్సు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో బుధవారం ఏఐ హాక్ డేస్-2025 సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీపీజేఏకే ఇన్ఫోటెక్ సీఈవో శ్యామ్‌సాగర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు హ్యాకథాన్‌లలో పాల్గొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. 156 మంది 52 బృందాలుగా ఏర్పడి ఆరోగ్య సంరక్ష ణ, వ్యవసాయం, క్రియేటివ్ టెక్ డొమైన్లో కృత్రిమ మేధ ఆధారిత ప్రాజెక్టులను సమర్పించారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ డీన్లు విజయ్‌కుమార్, విష్ణుమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేసవిలో విద్యుత్ సరఫరాకు ముందస్తు చర్యలు

వికారాబాద్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా రానున్న వేసవిలో వినియోగదారులకి నిరంతర, నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ ఆనంద్ తెలిపారు. బుధవారం ఈ మేరకు విద్యుత్ శాఖ జిల్లా కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖలో పెండింగ్‌లో ఉన్న పనులు తర్విత గతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ నంబర్ 1912 సేవలను జీహెచ్‌ఎంసీతో పాటు రూరల్ ఏరియాకు కూడా అందుబాటులోకి తెచ్చారని వినియోగదారులు ఈ సేవలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో విద్యుత్ అధికారులు లీలావతి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అందరూ సహకరించాలి

ఆమనగల్లు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి విషయంలో అందరూ కలిసి రావాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కోరారు. మాడ్గుల మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం ఎమ్మెల్యేను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మండల పరిధిలోని ఇర్విన్ నుంచి కుర్మేడ్ రోడ్డు ఆధునీకరణకు రూ.2.40 కోట్లు, బోరగుండు నుంచి అందుగుల, పల్లెతండా నుంచి అందుగులకు రూ. 3.80 కోట్లు మంజూరు చేయడాన్ని హర్షిస్తూ ఆమనగల్లు మాజీ మార్కెట్ చైర్మన్ కిషన్‌రెడ్డి, మాడ్గుల మాజీ జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు శేఖర్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ జగన్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సత్కరించి అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల మండలంలో పాఠశాలలు, కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు రూ.10.43 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు సూదిని కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ రమేశ్, చందన్ నాయక్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూమిని ఆక్రమిస్తున్న వారిపై కేసు

ధారూరు, జనవరి 29: ధారూరు అటవీ రేంజ్‌లోని రాస్నం అడవిలోని చెట్లను, రాళ్లను తొలిగించి, అటవీ హద్దులను చెరిపేసి పొలాలకు రోడ్డు వేసుకున్న వారిపై అటవీ శాఖ అధికారులు కేసు నమోదు చేశారు. ధారూరు అటవీ రేంజర్ రాజేందర్ తెలిపిన ప్రకారం.. అటవీ ప్రాంతంలో రాస్నం గ్రామానికి చెందిన సదానంద రెడ్డి కొనుగోలు చేసిన ఐదెకరాల పొలానికి దారి కోసం చుట్టుపక్కల రైతులను రెచ్చగొట్టి అటవీ భూమిలో నుంచి దారి వేసుకునేందుకు ప్లాన్ చేశాడు. ఈ నెల 26న సెలవు కావటంతో అధికారులంతా గణతంత్ర వేడుకల్లో ఉన్న సమయంలో అదునుచూసి జేసీబీతో అటవీ ప్రాంతంలోని చెట్లను, రాళ్లను తొలిగిస్తుండగా సమాచారం అందుకున్న రేంజర్ రాజేందర్ పనులను నిలిపివేయించాడు. ఆ రోజు పనులను నిలిపివేసిన సదానంద రెడ్డి మరి కొందరితో కలిసి అటవీ హద్దులను చెరిపివేసి రాళ్లను, చెట్లను తొలిగించి పొలానికి దారి చేశాడు. అటవీ భూమిలో నుంచి అక్రమంగా దారి వేసినట్లు ఫిర్యాదు రావటంతో రేంజర్ సిబ్బందితో వెళ్లి విచారణ జరిపి అటవీ ప్రాంతంలో వేసిన దాదాపు 100 మీటర్ల రోడ్డును బుధవారం జేసీబీతో గుంతలు, కందకాలు తవ్వించి రోడ్డును మూసి వేయించారు. నిందితుడు సదానంద రెడ్డితోపాటు మరి కొంతమందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బోగస్ హామీలతో నట్టేటా ముంచారు

» మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల్లో బోగస్ హామీలిచ్చి ప్రజలను నట్టేటా ముంచిందని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆరోపించారు. కోర్టు నిబంధనల మేరకు బుధవారం బొంరాస్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో హాజరైన ఆయన అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అమలుకు సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలతో కాలయాపన చేస్తుందని ఆరోపించారు. పంట రుణమాఫీ రైతులకు పూర్తి స్థాయిలో కాలేదని, రైతు భరోసా ఏడాదిగా ఎగ్గొట్టి ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటంతో రైతు భరోసా జమచేస్తూ మభ్యపెడుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసేంతవరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కోట్లయాదగిరి, బాబర్, దేశ్యనాయక్, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శేరి నారాయణరెడ్డి, బంద శ్రీను, తిరుపతయ్య పాల్గొన్నారు.

రాజకీయంలో రిటైర్‌మెంట్ ఉండదు

» ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్ టౌన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాజకీయ రంగంలో విరమణ ఉండదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. పదవీ కాలం ముగించుకున్న గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పాలకవర్గానికి బుధవారం వీడ్కోలు సభ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఈటల మాట్లాడుతూ.. ఐదేళ్ల పాటు మంచిగా సేవలందించిన నాయకులను ప్రజలు తప్పక ఆదరిస్తారన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడే వారికి తన సహకారం ఉంటుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే మల్లారెడ్డి మట్లాడుతూ.. ప్రజలకు సేవలందించిన నేతలను ప్రజలు ఎప్పుడూ గుర్తుంచుకుంటారన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారనానరు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముద్దుల లక్ష్మీశ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ప్రకాశ్‌రెడ్డి

పెద్దమ్మగుడి నిర్మాణానికి స్థలం కేటాయించాలి

కందుకూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగూడలో పెద్దమ్మగుడి నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి కోరుతూ మహేశ్వరం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సామ ప్రకాశ్‌రెడ్డి వినతిపత్రం ఇచ్చారు. బుధవారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులతో కలిసి నగరంలోని ఆమె నివాసానికి వెళ్లి వినతిపత్రం ఇచ్చారు. ప్రకాశ్‌రెడ్డి మాట్లాడారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ స్థలంలో భారీఎత్తున పెద్దమ్మ గుడిని నిర్మించడానికి నిర్ణయించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి రెవెన్యూ అధికారులతో మాట్లాడి గుడి నిర్మాణానికి స్థలం కేటాయించడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. దీక్షిత్‌రెడ్డి, పిట్టల శేఖర్, నర్సింహ, పి.యాదయ్య, సత్తయ్య, సత్యనారాయణ, బొక్క వెంకట్‌రెడ్డి, సి.శేఖర్, నరేందర్, సు రేష్, తదితరులున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఆ దిశగా చొరవ తీసుకోవాలి..
- అధికారులతో ఎమ్మెల్యే రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేట్లు చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని, పథకాల అమలులో నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పథకాల అమలులో ఎక్కడా గ్యాప్ రాకుండా ఆయా శాఖల అధికారుల మధ్య సమన్వయం అవసరమన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, గృహలక్ష్మి, గృహజ్యోతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై సంబంధిత అధికారులతో సమీక్ష చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అన్ని పథకాలు అమలవుతున్నాయన్నారు. అక్కడక్కడా అర్హత ఉన్నా పథకాలకు ఎంపిక చేయడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, అర్హులెవరూ ఆందోళన చెందకుండా మండలాలు, మున్సిపాలిటీల్లో ఇంటింటి సర్వే నిర్వహించి లబ్ధిదారుల జాబితా రూపొందించాలంటూ ఆదేశించారు. ఎలాంటి అపోహలకు తావు లేకుండా వచ్చేనెల 10 లోపు సర్వే పూర్తి చేయాలన్నారు. ముందుగా ఇంటి స్థలం ఉండి ఇళ్లులేని పేదలకు ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. ఇంటి స్థలం, ఇల్లు లేని పేదల కోసం ప్రభుత్వ భూమి ఎక్కడ ఉందనేది సర్వేచేసి వివరాలివ్వాల్సిందిగా తహసీల్దార్లకు సూచించారు. అర్హులైన కొందరికి గ్యాస్ సబ్సిడీ అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని.. ఈ విషయంలో అధికారులు తగిన చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. అలాగే 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ పూర్తి స్థాయిలో పేదలకు అందేట్లు చూడాలన్నారు. పథకాల అమలులో ఇందిరమ్మ కమిటీల సేవలను వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా పలు రూట్లలో ఆర్టీసీ బస్సుల ట్రిప్పులను పెంచాలని వస్తున్న విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకోవాలని డీఎం వెంకటనర్సప్పకు సలహా చేశారు. ప్రస్తుతం ఉన్న బస్సుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని అన్ని రూట్లలో బస్సులు నడుపుతున్నామని అదనంగా మరో 20 బస్సులు అవసరముందని డీఎం అన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం మండలాలకు సంబంధించి లబ్ధిదారులకు 42.56 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. సమావేశంలో ఆర్డీవో కె.అనంతరెడ్డి, స్పెషలాఫీసర్ నవీన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ఏడీ సుజాత, ట్రాన్స్‌కో ఏడీ సీతారాములు, ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్లు సునీతారెడ్డి, ప్రసాదరావు, అయ్యప్ప, శ్రీవాణి, ఎంపీడీవోలు వెంకటమ్మ, బాలశంకర్, నరేందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల, తుర్కయాంజాల్, పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కమీషనర్లు రవీందర్‌సాగర్, బాలకృష్ణ, అమరేందర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, గృహ ని ర్మాణ శాఖ డీఈ సంపత్‌కుమార్, మా ర్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్లు పాండురంగారెడ్డి, హన్మంత్‌రెడ్డి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టీచర్ బదిలీ.. తెరుచుకోని బడి

- నాలుగు రోజులుగా విద్యార్థుల ఇబ్బందులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బాలాజీనగర్ తండా గిరిజనులు
- రోజూ పాఠశాలకు వచ్చి వెనుదిరిగి పోతున్న విద్యార్థులు


టీచర్ లేక పాఠశాల ఆవరణలో కూర్చున్న విద్యార్థులు

కడ్తాల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు లేక కడ్తాల మండలం బాలాజీనగర్ తండా ప్రాథమిక నాలుగు రోజులుగా మూతబడింది. విద్యార్థులు రోజూ పాఠశాలకు వచ్చి టీచర్లు రాకపోవడంతో ఇంటికి వెళ్లిపోతున్నారు. కొందరు విద్యార్థులు ఊర్లో ఆడుతూ కన్పిస్తున్నారు. బాలాజీ నగర్ తండా ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 తరగతుల వరకు 20 మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ ఒకే టీచర్ పనిచేసేవారు. కాగా, ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుడు హర్య 317 జీవో స్పౌజ్ బదిలీల్లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు బదిలీ అయ్యారు. దాంతో 26 జనవరి నుంచి తరగతులు నడవక విద్యార్థులు రోజూ పాఠశాలకు వచ్చి కొద్దిసేపు ఆవరణలో కూర్చొని ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఉన్న ఉపాధ్యాయుడిని బదిలీ చేసిన ప్రభుత్వం అందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం పట్ల గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బీజేపీ నాయకుల నిరసన

ఉపాధ్యాయుడు లేక తెరుచుకోని బాలాజీ నగర్ తండా ప్రాథమిక పాఠశాలను బీజేపీ నాయకులు బుధవారం సందర్శించారు. బీజేపీ మండలాధ్యక్షుడు దోనాదుల మహేశ్, జిల్లా నాయకుడు రాందాస్ నాయక్‌ల ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట నాయకులు నిరసన తెలిపారు. నాలుగు రోజులుగా టీచర్ లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్న ఎవరు పట్టించుకోకపోతే ఎలా మండిపడ్డారు. వెంటనే టీచర్‌ను నియమించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో కడ్తాల ఎంఈవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. మాలే శ్రీశైలంగౌడ్, బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు మన్యానాయక్, నాయకులు కళ్యాణ్‌నాయక్, భాస్కర్‌నాయక్, తదితరులు ఉన్నారు.

డీఈవోకు నివేదించాం

పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు హర్య స్పౌజ్‌లో భాగంగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఉపాధ్యాయుడు రాక మూడు రోజులుగా తరగతులు కొనసాడం లేదు. టీచర్ నియామకం గూర్చి జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదించాం. సీఆర్పీని పంపి నేటి(గురువారం) నుంచి తరగతులు కొనసాగేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

- ఎంఈవో సత్యనారాయణ

బండి సంజయ్ వ్యాఖ్యలపై భగ్గుమన్న ప్రజా సంఘాలు

- గద్దర్‌పై అనుచిత కామెంట్లపై నిరసన

ఆమనగల్లు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా యుద్దనౌక గద్దర్‌పై కేంద్ర హోం శాఖ సహాయమంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై ప్రజా సంఘాల నేతలు, గద్దర్ విగ్రహ కమిటీ సభ్యులు, న్యాయవాదులు, కాంగ్రెస్ నేతలు భగ్గుమన్నారు. ఆమనగల్లు పట్టణంలో బుధవారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేపల్లి జగన్, గద్దర్ విగ్రహ కమిటీ కన్వీనర్ లక్ష్మణశర్మ, పూలే అంబేడ్కర్ జాతర కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌ల ఆధ్వర్యంలో నాయకులు, సంఘాల నేతలు పాల్గొని హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. బండిని మంత్రి పదవి నుంచి ఆయనను తొలగించాలని డిమాండ్ చేశారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్న వారికే పద్మ వార్డులు ఇ స్తారా? అని ప్రశ్నించారు. జేపీసీ కన్వీనర్ శివలింగం, నాయకులు ఇబ్రాయెల్, రజితక్క, సాత్రినర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

షాబాద్ : గద్దర్ పదవుల కోసమో, డబ్బు కోసమో, అవార్డుల కోసమో తన జీవితాన్ని పణంగా పెట్టి పని చేయలేదని, తెలంగాణ కోసం, పీడిత, పేద ప్రజల కోసం, అణగారిన వర్గాలు, మహిళల కోసం పోరాడారని అలాంటి వ్యక్తిని విమర్శించడం బండి సంజయ్‌కి తగదని, ఆయన వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పామెన జ్యోతి భీంభరత్ అన్నారు. ఆమె నివాసంలో విలేకరులతో మాట్లాడారు. గద్దర్ ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది అభిమానుల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారని, సమాజ చైతన్యం కోసం నిస్వార్థంగా పనిచేసిన నాయకుడని, ఇంజనీరింగ్ ఉద్యోగాన్ని వదిలేసి సమాజహితానికి కలం చేతపట్టి గళం వినిపించిన యుద్దనౌక గద్దర్ అని కొనియాడారు. బండి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు.


యాచారం : బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాల మహానాడు కార్యకర్తలు

యాచారం : ప్రజాగాయకుడు గద్దర్‌కు పద్మ అవార్డు ఇవ్వరాదన్న బీజేపీ నాయకులు తీరు దారుణమని రాష్ట్ర మాలమహానాడు నాయకులు గుండాలు అన్నారు. బండి సంజయ్ వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలో నాగార్జునసాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై సంజయ్ దిష్టిబొమ్మను నాయకులతో కలిసి దహనం చేశారు. బండి సంజయ్, కె.బాషాల తీరు దారుణమని విమర్శలు చేశారు. గోపాల్, బి.జగన్, మల్లేష్, కుమార్, గణేష్, ప్రవీణ్, మనోజ్ తదితరులున్నారు.



మంత్రి తుమ్మలకు నాయకుల సన్మానం


కందుకూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును మండల మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ఘనంగా సన్మానించారు. బుధవారం మహేశ్వరం నియోజకరవ్గం పరిధి ఎన్‌టీఆర్ నగర్‌లో గల మార్కెట్‌కు వచ్చిన మంత్రిని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డితో కలిసి సన్మానించారు. విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్, గొరెంకల యాదయ్య, తదితరులున్నారు.

బీజేపీ కేశంపేట మండలాధ్యక్షురాలిగా రాధిక




కేశంపేట, జనవరి 29(ఆంధ్ర జ్యోతి): బీజేపీ కేశంపేట మండల అధ్యక్షురాలిగా రొల్ల రాధిక నియమితులైనారు. మండల పరిధిలోని అల్వాలకు చెందిన రాధికను రాష్ట్ర బీజేపీ రాష్ట్ర నాయకత్వం అధ్యక్షురాలిగా నియమించారు. ఈమేరకు బుధవారం సీనియర్ నాయకులు ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో రాష్ట్ర న్యాయకత్వం మండలాధ్యక్ష పదవి అప్పగించనందుకు కృ తజ్ఞతలు తెలిపారు. ఎంపీ డీకే అరుణ, రాష్ట్ర నాయకులు శ్రీవర్ధన్ రెడ్డి, బాబయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, అశోక్‌గౌడ్, రఘు రాములుగౌడ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సై యాదయ్యకు సన్మానం



ఆమనగల్లు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఏఎస్ఐ నుంచి ఎస్ఐగా పదోన్నతి పొందిన యాదయ్యకు బుధవారం ఆమనగల్లు విశ్వ బ్రాహ్మణ సంఘం జిల్లా నాయకుడు తల్లోజు రామకృష్ణ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసు స్టేషన్‌లో యాదయ్యను పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. నాయకులు గన్నోజు వెంకటయ్య, అంజనేయులు, నరేశ్ తదితరులు ఉన్నారు.

అక్షితను అభినందించిన డీఈవో



యాచారం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు సహకారమందించి ఆదుకుంటామని డీఈవో సుశీందర్‌రావు అన్నారు. అండర్-17లో అథ్లెటిక్స్‌లో యాచారం ఉన్నత పాఠశాలకు చెందిన అక్షిత గోల్డ్‌మెడల్ సాధించిన విషయం విదితమే. ఉపాధ్యాయులు డీఈవోకు ఈ విషయం తెలపడంతో బుధవారం కలెక్టరేట్‌లో అక్షితను సత్కరించి అభినందించారు. ప్రభుత్వ పరంగా ప్రత్యేక కోచింగ్ ఇప్పించి ఆదుకుంటామన్నారు. పీడీ, పీఈటీలను ప్రశంసించారు. బీసీ వెల్ఫేర్ డివిజనల్ ఆఫీసర్ రమేశ్, హాస్టల్ వార్డెన్ అక్షితను సన్మానించారు.

బైపాస్ రోడ్డును పట్టించుకోరా?

(5వ పేజీ తరువాయి)

భూముల అభివృద్ధికి దృష్టిలో ఉంచుకుని ఈ బైపాస్ రోడ్డు నిర్మాణం ఏర్పాటు చేశారు. అలాగే ఎన్ఎస్‌జీ ఆక్టోపస్‌లకు వెళ్లే వాహనాలకు కూడా ఈ రోడ్డు ఉపయోగకరంగా ఉండడంతో ఇబ్రహీంపట్నం టౌన్‌లో కొంతవరకు ట్రాఫిక్ తగ్గిపోయింది. కాగా, నాగన్‌పల్లి రోడ్డు నుంచి సుచిరా బార్ వరకు మరో విడతలో రెండు కిలోమీటర్ల పొడవునా ఈ రహదారిని అభివృద్ధి చేయడానికి మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చొరవ తీసుకుని నిధుల మంజూరుకు సంబంధించిన ప్రొసీడింగ్ తీసుకొచ్చారు. ఆ వెంటనే ఎన్నికలు రావడంతో పనులు చేపట్టలేకపోయారు. నాగన్‌పల్లి రోడ్డు నుంచి సుచిరా బార్ వరకు రహదారి అందుబాటులోకి వస్తే సాగర్ వైపు నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలు ఇబ్రహీంపట్నం టౌన్ నుంచి కాకుండా నేరుగా బైపాస్ నుంచి వెళ్లే వెసులుబాటు ఉంటుంది. పైగా దూరభారం కూడా తగ్గుతుంది. గతంలో కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ రహదారిని వంద ఫీట్లతో అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించగా.. అప్పట్లో ఎన్నికలు రావడంతో అది సాధ్యపడలేదు. ఈ రహదారిని అనుసరించి వైట్ గోల్డ్ ఇంటిగ్రేటెడ్ స్పిన్‌లెక్స్ పార్కులో పలు నూలు పరిశ్రమలు తమ కార్యకలాపాలు కొనసాగిస్తుండగా భారత్ ఎలక్ట్రానిక్స్ (బీఈఎల్) రూపుదిద్దుకుంటోంది.

కంపు కొడుతున్న బైపాస్ రోడ్డు

కృష్ణా పైప్‌లైన్ వెంట ఉన్న బైపాస్ రోడ్డు నిర్వహణను పట్టించుకోకపోవడంతో చెత్తాచెదారంతో నిండిపోయి కంపు కొడుతోంది. రాత్రి వేళల్లో చికెన్ షాపుల నుంచి తెచ్చిన వ్యర్థాలు, కూల్చిన ఇళ్ల దస్తును వాహనాల్లో తెచ్చి పోస్తున్నారు. దీంతో ఈ రోడ్డు డంపింగ్ యార్డును తలపిస్తోంది. వ్యర్థాల నుంచి వస్తున్న దుర్వాసనను సమీపంలోని కాలనీల జనం భరించలేకపోతున్నారు. పందులు సంచరించి, దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

బైపాస్ రోడ్డును అభివృద్ధిలోకి తేవాలి



ఇబ్రహీంపట్నంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువై పోయింది. బైపాస్ రోడ్డును అభివృద్ధిలోకి తీసుకొస్తే ఆ సమస్య తీరుతుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొంతమేర పనులు చేపట్టి వదిలేశారు. ఈ ప్రభుత్వమైన పట్టంచుకొని రోడ్డు బాగు కోసం నిధులు మంజూరు చేయాలి.

- దండె శ్రీశైలం యాదవ్, బీజేపీ ఇబ్రహీంపట్నం మండలాధ్యక్షుడు

లింకు రోడ్లకు అనుసంధానంగా బైపాస్



ఇటు రాయపోల్, దండుమైలారం మీదుగా.. అటు నాగనపల్లి నుంచి రామోజీ ఫిలింసిటీ మీదుగా విజయవాడ రహదారికి వెళ్లేందుకు బైపాస్ రోడ్డు అనుసంధానంగా ఉంది. పైగా టౌన్ గుండా వెళ్లే భారీ వాహనాలు, హైదరాబాద్ నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సులకు సౌకర్యంగా ఉంటుంది. అలాగే ఈ దారితో పట్నంలో ట్రాఫిక్ తగ్గి సమీప కాలనీలు అభివృద్ధిలోకి వస్తాయి.

- నిట్టు దానయ్య, దండుమైలారం

కాంగ్రెస్ నేతల సంబురాలు


కడ్తాల : పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఆమనగల్లు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపికైన పోలెపల్లి గ్రామ రైతుల ఖాతాల్లో డబ్బు జమకావడాన్ని హర్షిస్తూ గ్రామంలో మాజీ ఉప సర్పంచ్ అంజన్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, రైతులు సంబురాలు చేసుకున్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, మాజీ సర్పంచ్ బాల్‌రామ్‌ల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి మిఠాయిలు పంచారు. కాంగ్రెస్, రేవంత్, కసిరెడ్డి కి అనుకూలంగా నినాదాలు చేశారు. కర్నాటి భగవాన్ రెడ్డి, అభినవ్ రెడ్డి, కృష్ణారెడ్డి, బుచ్చిరెడ్డి, జగ్‌రామ్, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు. ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మార్కెట్ వైస్‌చైర్మన్ భాస్కర్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్‌లు హాజరయ్యారు. సీఎం, ఎమ్మెల్యే, ఎంపీ మల్లు రవి, చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. లక్‌పతి నాయక్, లక్ష్మయ్య, లక్ష్మణ్‌నాయక్, బ్రహ్మచారి, మల్లయ్య, చందోజీ, తదితరులున్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం


చేవెళ్లకు తరలిన బీజేపీ నాయకులు

షాబాద్, జనవరి 29(ఆంధ్ర జ్యోతి): స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు పీసరి సతీష్‌రెడ్డి, అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం చేవెళ్లలో 30 అడుగుల జెండా ఆవిష్కరణకు షాబాద్ మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. వారు మాట్లాడుతూ కేంద్ర సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేద్దామన్నారు. మండలాధ్యక్షుడు మాణయ్య, యువమోర్చా జిల్లా అధికార ప్రతినిధి మహేందర్, నాయకులు కిరణ్, రాజీవ్‌రెడ్డి, సురేష్, మహేష్, కృష్ణచారి, ప్రశాంత్, విఠలయ్య, రవీందర్, విజయ్, అనంతం, మల్లేష్, జగదీష్, శివారెడ్డి, అశోక్, నరేందర్‌రెడ్డి, శివరాజ్, తదితరులున్నారు.

సంక్షిప్తంగా..

ఇబ్రహీంపట్నం : ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించినప్పుడే ప్రమాదాలను అరికట్టినవారమవుతామని ఎంవీఐ మున్నీ అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, రవాణా విభాగాల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థి దశనుండే రోడ్డు భద్రతకు సంబంధించి నియమాలను పాటించి ఇతరులకు చెప్పేలా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ డా.ఎస్.రాధిక, వైస్ ప్రిన్సిపాల్ డా.సురేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా.రాకేష్ భవాని తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : హైదరాబాద్-బీజాపూర్ జాయతీ రహదారి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సామాజిక కార్యకర్త మల్లారెడ్డి చేపట్టిన రీలే దీక్ష రెండోరోజు కొనసాగించారు. విషయం తెలుసుకున్న వివిధ పార్టీల నాయకులు, ప్రజా, డ్రైవర్ల సంఘాల నాయకులు పెద్ద ఎత్తున దీక్ష శిబిరానికి చేరుకుని మద్దతు ప్రకటించారు. బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింలు(చింటు), కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, కాసుల రాఘవేందర్‌గౌడ్, మల్లారెడ్డి, దండు సతీష్, బండల చంద్రయ్య, సీహెచ్. యాదయ్య, బీ. యాదయ్య, శ్రీనివాస్ గ్రామస్తులు తదితరులు మద్దతు తెలిపారు.

తలకొండపల్లి : వెల్జాలలో ఉర్సును ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్ యాదవ్, ముస్లిం మత పెద్దలు అబ్దుల్ నయామ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దర్గా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీనివాస్ యాదవ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ముజుబుర్‌రహెమాన్, నాయకులు వాహెద్‌అలీ, రహెమాన్, పారుఖ్, ఖాజామైనోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : బాధిత కుటుంబాలకు, నిరుపేదలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని కడ్తాల మాజీ వైస్ ఎంపీపీ బావండ్లపల్లి ఆనంద్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహరెడ్డి, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు కడారి రామకృష్ణలు అన్నారు. కడ్తాలలో ఇటీవల మృతి చెందిన వరికుప్పల బాలయ్య కుటుంబాన్ని ఆనంద్, ఎల్ఎన్‌రెడ్డి, రామకృష్ణలు పరామర్శించారు. మృతుడి కుటుంబానికి రూ.10 వేలు ఆనంద్, జీఎల్ఎన్‌రెడ్డిలు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కేశని మహేశ్‌ను వారు పరామర్శించారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహరెడ్డి రూ.5వేల ఆర్థికసాయం అందించారు. పరామర్శించిన వారిలో నాయకులు మూడ అశోక్, అమృతం, పాండు, నాగార్జున, రాకేశ్, తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మంచాల, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మంచాల పోలీస్‌స్టేషన్ పరిధి అజినాతండా సమీపంలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. వివరాలిలా ఉన్నాయి. బండలేమూర్ అనుబంధ అజినాతండా సమీపంలోని వ్యవసాయ పొలాల వద్ద ఉదయం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా, మృతుడు మూడు రోజులక్రితం అటుగా వెళ్లినట్లుగా గొర్రెల కాపరులు చూసినట్లు సమాచారం. ఈ విషయమై సీఐ మధు మాట్లాడుతూ మృతుడి వయస్సు 40-45 ఏళ్లుగా ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచామని, ఆచూకీ తెలిసినవారు సంప్రదించాలని సూచించారు. మృతుడి ఒంటిపై బ్లూకలర్ ప్యాంటు, వైట్ షర్ట్ ఉన్నట్లు చెప్పారు.

స్కూటీని ఢీకొట్టిన కారు.. వ్యక్తి మృతి

యాచారం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): స్కూటీని కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మరణించగా.. మరొకరికి తీవ్రగాయాలైన ఘటన యాచారం పోలీస్ స్టేషన్ పరిధి నక్కగుట్టతండా వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పశ్చిమబెంగాల్‌లోని పాసియాబాద్ జిల్లా కల్జబారికి చెందిన బాపిరెహమాన్(40) జుబెల్ (38)లు మంగళవారం రాత్రి యాచారంలో వ్యక్తిగత పని ముగించుకొని తిరిగి తక్కళ్లపల్లి సమీపంలోని ఫౌల్ట్రీఫాంకు స్కూటీపై వెళుతుండగా నక్కగుట్టతండా సమీపంలో వెనకాల నుంచి వస్తున్న కారు స్కూటీని బలంగా ఢీకొట్టింది. దాంతో స్కూటీ నడుపుతున్న బాపిరెహమాన్ తీవ్రంగా గాయపడడంతో యాచారం పెట్రోమొబైల్-2 పోలీసులు మాల్‌లోని స్టార్‌లైఫ్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మరణించాడని ధ్రువీకరించారు. మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడ్డ జుబెల్ మాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సీఐ నర్సింహారావు తెలిపారు.

గోతిలో పడి గుర్తుతెలియని వ్యక్తి ..

షాద్‌నగర్ రూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశత్తు గోతిలో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. పట్టణ శివారులోని బుచ్చిగూడ బైపాస్ సర్వీస్ రోడ్డు పక్కన ఉన్న గోతిలో పడి మృతిచెందినట్లు తెలిపారు. సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి మూడు రోజుల కింద మృతిచెంది ఉంటాడని తెలిపారు. మృతుడి శరీరంపై పెసరు రంగు కలరు టీ షర్టు, నీలిరంగు వైట్ ప్యాంట్ ఉన్నట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ నెంబర్ 87126 63329కు సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

అదృశ్యమైన వ్యక్తి శవమై..

యాచారం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : అదృశ్యమైన వ్యక్తి శవమై కనిపించాడు. ఈ ఘటన బుధవారం యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని నందివనపర్తిలో వెలుగుచూసింది. నందివనపర్తికి చెందిన జాపాల లక్ష్మయ్య(70) ఈనెల 23న రాత్రి ఇంటినుంచి బయటకు వెళుతున్నట్లు కుటుంబసభ్యులకు చెప్పి వెళ్లిపోయాడు. అతడిపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అయితే, బుధవారం ఉదయం పొలంలో చెట్టుకు ఉరివేసుకోగా.. మెడకు బిగించిన తాడు తెగి కింద పడడంతో మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్న ఆనవాళ్లున్నాయి.

కారు-లారీ ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

యాచారం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కారు-లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు గాయపడగా లారీ కల్వర్టులో పడిపోయిన ఘటన బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు యాచారం మండల కేంద్రంలో జరిగింది. నగరానికి చెందిన హేమంత్(20), భానుచందర్(24)లు మద్యం సేవించారు. అనంతరం కారు నడపుతూ మండల కేంద్రంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టడంతో కారు ధ్వంసం కాగా.. లారీ కల్వర్టులో పడిపోయింది. కారులో ఉన్న హేమంత్, భానుచందర్‌లు తీవ్రంగా గాయపడ్డారు. కాగా, కారులో మద్యం బాటిళ్లు కనిపించాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహరావు తెలిపారు.

ఎదురెదురుగా బైకులు ఢీ.. వ్యక్తికి గాయాలు

కేశంపేట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాటిగడ్డ సమీపంలో బుధవారం ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. లేమామిడికి చెందిన బైండ్ల శ్రీకాంత్ గ్రామం నుంచి కొత్తపేట వైపు వెళ్తుండగా పాటిగడ్డ సమీపంలో ఎదురుగా పాటిగడ్డ గ్రామం వైపు నుంచి వస్తున్న గుర్తుతెలియని బైక్‌పై ఉన్న వ్యక్తి ఢీకొట్టాడు. దాంతో శ్రీకాంత్ కుడి కాలుకు గాయాలైనాయి. సమాచారం అందుకున్న కేశంపేట 108 పైలెట్ శ్రీనివాస్, ఈఎంటీ రాంచంద్రయ్యలు వెంటనే ఘటనా స్థలానికి వచ్చి శ్రీకాంత్‌ను షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు.

యువకుడిపై దాడి.. కేసు నమోదు

కేశంపేట, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపేటలో యువకుడిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. సీఐ నరహరి కథనం మేరకు.. సంతాపూర్ గ్రామానికి చెందిన మద్దు సందీప్ తన అమ్మమ్మ గారి ఊరైన కొత్తపేటకు మంగళవారం సాయంత్రం వెళ్లాడు. అక్కడ ప్రభుత్వ పాఠశాల వద్ద తనతో పాటు చదువుకున్న కొత్తపేటకు చెందిన అభిషేక్, నవీన్, భానులను కలవడానికి వెళ్లాడు. ఈ క్రమంలో సందీప్, అభిషేక్‌ల మధ్య గొడవ జరిగింది. మాటామాట పెరగడంతో సందీప్‌ను అభిషేక్ ఇనుప రాడ్‌తో దాడిచేసి తీవ్రంగా గాయపరిచాడు. గమనించిన తోటి యువకులు సందీప్‌ను ఆసుపత్రికి తరలించారు. బుధవారం సందీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

ఫంక్షన్‌హాళ్ల యజమానులపై కేసు

శంకర్‌పల్లి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన శంకర్‌పల్లిలోని రెండు ఫంక్షన్‌హాళ్ల యజమానులపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లిలోని సంగారెడ్డి రోడ్డులో గల మణి గార్డెన్, మొయిన్ ఫంక్షన్ హాళ్లలో అర్ధరాత్రి వరకు డీజే, సౌండ్ బాక్సులు పెట్టి చుట్టుపక్కల వారిని ఇబ్బందులకు గురిచేశారు. దాంతో యజమానులతో పాటుగా సౌండ్ బాక్సులు పెట్టిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఇకపై ఎవరైనా డీజే, సౌండ్ బాక్సులు పెట్టి పెద్ద పెద్ద శబ్దాలతో ఇతరులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫంక్షన్‌హాళ్ల యజమానులను గతంలోనే పిలిపించి హెచ్చరించడం జరిగిందన్నారు.

వీధికుక్కల దాడిలో జింకపిల్ల మృత్యువాత

కడ్తాల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో జింక పిల్ల మృతిచెందింది. మండలంలోని అన్మాస్‌పల్లి మహేశ్వర మహా పిరమిడ్ సమీపంలో బుధవారం ఈ సంఘటన జరిగింది. అటవీ అధికారుల కథనం మేరకు.. మహేశ్వర మహా పిరమిడ్ సమీపంలోని అటవీ ప్రాంతంలో తరచూ జింకలు తిరుగుతున్నాయని, అదే సమయంలో వీధి కుక్కలు జింక పిల్లలపై దాడి చేశాయని చెప్పారు. దాడిలో గాయపడిన ఓ జింకపిల్ల మృతిచెందింది. స్థానికుల సమాచారంతో అటవీ శాఖ అధికారులు జింకను స్వాధీనం చేసుకున్నారు. కడ్తాల్ పశు వైద్య కేంద్రంలో జింకపిల్ల కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు.

కాటమయ్య రక్షణ కిట్లు మంజూరు

ఆమనగల్లు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్, మాడ్గుల మండలాలకు రెండో విడత కింద 280 కాటమయ్య రక్షణ కిట్లు మంజూరైనట్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ తెలిపారు. తాటిచెట్లు ఎక్కే గీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం కాటమయ్య రక్షణ కవచం సేఫ్టీ కిట్లను బీసీ సంక్షేమ శాఖ ద్వారా అందిస్తుందన్నారు. కడ్తాల మండలం ముద్విన్, మాడ్గుల మండలం ఇర్విన్, మాడ్గుల, నాగిళ్ల గ్రామాలలో బుధవారం సీఐ పర్యటించారు. రక్షణ కిట్ల వినియోగంపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.